
సాక్షి చిత్తూరు

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



ఆక్రమణలు తొలగించి వేలం వేయండి

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యంలో ఆక్రమణలు తొలగించాకే వేలం వేయాలని గ్రామస్తులు ఈఓని నిలదీశారు. - 8లో



శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి

కాణిపాక వరసిద్ధుని ఆలయంలో శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతమాచరించారు. స్వర్ణరథంపై స్వామి ఊరేగారు. - 8లో



ఓవర్‌లోడ్ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు

ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి పకడ్బందీగా గ్రామసభలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 700 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల అభివృద్ధి, గ్రామాల ముఖ చిత్రం మారేలా అభివృద్ధి రూపకల్పన జరగాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీల ఆదాయం పెంచేలా పంచాయతీలను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'టంగుటూరి' జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని 22న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా గురువారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వం ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహిస్తోందని చెప్పారు.

ఆర్థిక సంఘం నిధులు రూ.17.54 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల అభివృద్ధి, నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు సంబంధించి 684 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17.54 కోట్లు విడుదల చేసింది. వీటిని పారిశుధ్యం, పచ్చదనం, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు, అభివృద్ధి పనులు, నీటి సౌకర్యం.. ఇత్యాది వాటికి వాటికి ఖర్చు చేయనున్నారు.

నైట్ వాచ్‌మన్ల నియామకానికి ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నైట్ వాచ్‌మన్ల నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కళాశాల స్పెషల్ ఫీజు ఫండ్‌ను వినియోగించి వాచ్‌మన్లకు జీతాలు ఇవ్వాలని, ఒక్కొక్క వాచ్‌మన్ నెలకు రూ.6వేలు జీతం ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మున్సిపాలిటీల్లో అధికారుల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలోని మున్సిపల్ పరిపాలన శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె.చిన్నయ్యను పల్నాడు జిల్లా గురజాల మున్సిపాలిటీకి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌ను పొన్నూరుకు బదిలీ చేయగా.. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా)లో పరిపాలన అధికారిగా ఉన్న వివి.నరసింహారెడ్డిని బద్వేలు కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాజంలో వైద్యవృత్తికి ఉత్కృష్టమైన స్థానం ఉంది. వైద్యులంటే ఎంతో గౌరవం ఉంది. ప్రాణాలు పోసేవారనే భావనతో భగవంతునితో సమానంగా చూడటం కూడా కద్దు. సుప్రీంకోర్టు మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రొటోకాల్, సేఫ్టీ టీం ఉండాలని స్పష్టం చేసింది. కోల్‌కతా దారుణ కృత్యం నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రులను 'సాక్షి' పరిశీలించినప్పుడు పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా కనీస సదుపాయాలు లేక వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని విశ్రాంతి గదుల్లో కంటికి కునుకు కూడా కరువవుతోంది. దీనిపై ప్రత్యేక కథనం.



డాక్టర్ విశ్రాంతి గదిలో కర్టెన్లు లేని కిటికీలు



నర్సింగ్ గది




నర్సింగ్ గదిలో కిటీలకు కట్టిన పరదాలు

ఆస్పత్రుల్లో భద్రత కరువు!

- చాలీ చాలని విశ్రాంతి గదులు
- మరుగుదొడ్లు అధ్వానం
- ఇబ్బందులు పడుతున్న మహిళా వైద్యులు, సిబ్బంది
- క్యాంటీన్ లేక రాత్రి పూట ఆకలికేకలు
- నైట్ డ్యూటీల్లో తప్పని అవస్థలు

మూడు షిఫ్టుల్లో వైద్యులు, సిబ్బంది వివరాలు

	మొదటి షిఫ్టు	రెండో షిఫ్టు	నైట్ షిఫ్టు
వైద్యులు/జూనియర్ డాక్టర్లు	60	60	39
హెడ్ నర్సులు	13	10	2
స్టాఫ్ నర్సులు	60	26	35
ఏఎన్ఎంలు	30	30	10
ఇతర సిబ్బంది	45	45	20





ఒక డాక్టర్ డ్యూటీ గదిలో మరుగుదొడ్డి దుస్థితి ఇలా..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిరోజూ ఓపీ 1000 దాటుతోంది. ఇన్‌పేషంట్లు 300 నుంచి 400 మంది వరకూ ఉంటున్నారు. వీరికి సేవలందించేందుకు మూడు షిఫ్టుల్లో వైద్యులు, సిబ్బంది కలిపి మొత్తం 600 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఉద్యోగినులు 400 మంది వరకు ఉన్నారు. ఉదయం -8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ..ఇలా మూడు షిఫ్టుల్లో వీరు పనిచేస్తున్నారు.ఆస్పత్రి సీసీ నిఘా కెమెరాల వ్యవస్థలో ఉంటోంది. సెక్యూరిటీ సిబ్బంది కూడా ఉన్నారు. కానీ డ్యూటీ డాక్టర్లకు, సిబ్బందికి కనీస వసతులు లేమితో ఇబ్బందులు పడుతున్నారు.

తిష్ట వేసిన సమస్యలు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఉదంతం దేశ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. పలు రాష్ట్రాల్లో వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళనబాట పట్టడం విదితమే. కోల్‌కత్తా డాక్టర్ గంటల తరబడి డ్యూటీ చేసి, సేదదీరేందుకు ప్రత్యేకించి రూమ్ అంటూ లేకపోవడంతో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంది. ఆ సమయంలో మానవ మృగాలు ఆమెను హత్యాచారం చేశాయి. అక్కడ కనీస వసతులు, నిఘా వ్యవస్థ లేదనే వెలుగులోకి వచ్చింది. ఈ తరుణంలో సుప్రీం కోర్టు సుమొటోగా స్వీకరించి మమత సర్కార్ నిర్లక్ష్యం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్, రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ పరిణామాల క్రమంలో జిల్లా ఆస్పత్రిని పరిశీలించినప్పుడు ఇక్కడ సీసీ కెమెరాల నిఘా ఉంటున్నప్పటికీ వసతులు లేమితో సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం డాక్టర్లకు 15 మరుగుదొడ్లు, విశ్రాంతి గదులున్నాయి. అలాగే హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సులకు కలిపి 8 గదులున్నాయి. వీటిలో చాలా వరకు కనీస వసతులు లేవు. కొన్ని గదులు అలంకార ప్రాయంగా ఉన్నాయి.

- ఎంఎస్ వార్డులోని డాక్టర్ విశ్రాంతి గది అలంకార ప్రాయంగా ఉంది. ఆ గదికి పూర్తి స్థాయిలో రక్షణ లేదు. ఫ్యాను కూడా లేదు. పేరుకు మాత్రం డాక్టర్ విశ్రాంతి గదిని బోర్డు పెట్టారు. అందులో ఓ స్ట్రక్చర్‌ను ఉంచారు. అలాగే అదే విభాగంలో మరో డాక్టర్ గదిని పరిశీలిస్తే అక్కడ అలంకార ప్రాయంగా మంచం వేసి ఉంచారు. అందులో లైట్లు లేవు. మరుగుదొడ్డి సరిగా లేదు. కిటికీలకు సైతం రిపేర్లు చేయాల్సి ఉంది. వాటికి కర్టెన్లు కూడా లేవు. అలాగే స్టాఫ్ నర్సుల విశ్రాంతి గదుల్లో కొన్నింటిలో చాలా వరకు చిన్నపాటి మరమ్మతులు చేయాల్సి ఉంది. చాలా కిటికీలకు కర్టెన్లు లేవు. కొన్ని చోట్ల కిటికీలకు పరదాలు కట్టిపెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో దుస్తులు మార్చుకునేందుకు మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.
- ప్రసూతి విభాగాల్లో కొంత మంది డాక్టర్ల గదికి అన్ని వసతులున్నా కొన్ని గదుల్లో ఏసీ పనిచేయడంలేదు. మంచానికి కవర్లు లేవు. బెడ్లు డాక్టర్లే కొని తెచ్చుకున్నారు. ఇక నర్సింగ్ విశ్రాంతి గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చాలీచాలనీ గదుల్లో అవస్థలే పడుతున్నారు. మంచాలు తక్కువగా ఉన్నాయి. ఉన్న మంచాలు కూడా బ్యాగులు పెట్టుకోవడానికే సరిపోతున్నాయి. లాకర్లు లేవు. చాలా గదుల్లో తాగునీరు లేని పరిస్థితి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడిక్కడ విరిగిపోయి ఉండటం కనిపించింది. ఫలితంగా కాలకృత్యాలకు పక్క విభాగాల్లోని గదులకు పరుగులు పెడుతున్నారు. రాత్రి పూట మల మూత్ర విసర్జనకు బిక్కుబిక్కుమంటూ పక్క విభాగాలకు వెళుతున్నారు. నైటీ డ్యూటీల్లో పని చేసే వైద్యులు, సిబ్బందికి కోల్‌కతా ఉదంతం నిగూఢభయాన్ని నింపింది.
- సాధారణ ఓపీ విభాగంలో కూడా డాక్టర్లు పేషెంట్లకు వైద్యసేవలు అందించి సేదదీరాలన్నా అక్కడ విశ్రాంతి గదులు లేవు. అలాగే మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కూడా ఇదే పరిస్థితి. సాధారణ ఓపీ విభాగాల్లో కూడా పూర్తిస్థాయిలో వసతులు, విశ్రాంతి గదులు కల్పించాల్సిన అవసరం ఉంది. కొన్ని చోట్ల నామమాత్రంగా డ్యూటీ డాక్టర్ గదులని బోర్డులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్యాంటీన్ ఏర్పాటు ఎన్నడో..?

జిల్లా ఆస్పత్రిలో వందలాది మంది వైద్య సిబ్బంది, 400 మంది వరకు పేషెంట్లు, వారి సహాయకులు మరో 600 మంది, అత్యవసర విభాగానికి వచ్చి వెళ్లే వారు 200 నుంచి 300 మంది ఉంటారు. వీరు నీళ్లబాటిల్ కావాలన్నా ఆస్పత్రి బయటకు వెళ్లాల్సిందే. ముఖ్యంగా డ్యూటీలోని మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రిపూట ఆకలికేకలతో అలమటించాల్సిన పరిస్థితి. ఇక్కడ క్యాంటీన్ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందితో ఆస్పత్రి బయట నుంచి టిఫిన్, భోజనం తెప్పించుకోవాల్సి వస్తోంది. ఇది రోజూ నిత్యకృత్యం. ఆస్పత్రిలో క్యాంటీన్ ఏర్పాటు చేయండి మహాప్రభో అని ఎన్నోసార్లు డిమాండ్ చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఆవరణలోనే క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తే వైద్యులు, సిబ్బందికే కాకుండా రోగులు, వారి సహాయకులకు ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

కోల్‌కతా ఘటన ఓ పాఠం



వైద్య చదువులు, వృత్తికి వెళితే పిల్లలు భద్రంగా ఉంటారని ప్రతి తల్లిదండ్రులు ఆలోచిస్తారు. అయితే ఆస్పత్రుల్లో కూడా రక్షణ లేదని, అక్కడ కూడా మానవ మృగాలు దాడి చేస్తాయని కోల్‌కతా ఘటనతో ఆస్పత్రుల్లోని డొల్లతనం బైటపడింది. ముందుగా మాకు రక్షణ కావాలి. భద్రత ఉండాలి. కష్టపడి పనిచేస్తాం. కానీ ఆ సమయంలో ప్రశాంతంగా నిద్రపోవాలని చూస్తాం. అలాంటి వాతావరణం కల్పించాలి.. సుప్రీంకోర్టు అభిప్రాయం మేరకు సేఫ్టీ టీం, ప్రొటోకాల్ ఉండాలని కోరుకుంటున్నాం. ఇది ప్రభుత్వ వ్యవస్థల్లోనే కాదు. ప్రైవేటు వ్యవస్థల్లో కూడా ఉండాలి.

–జీషితా, జూనియర్ డాక్టర్, చిత్తూరు



ప్రసూతి విభాగంలో అస్తవ్యస్తంగా ఉన్న నర్సింగ్ గది



ఎంఎస్ వార్డులో డ్యూటీ డాక్టర్ రూం



ఎంఎస్‌వార్డులోనే మరో విభాగంలో డాక్టర్ గది ఇలా..

“

భద్రత ముఖ్యం



కోల్‌కతా మహిళా వైద్యురాలి ఘటన తీవ్రంగా కలచి వేస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులు కూడా మేలుకోవాలి. మిగిలిన రాష్ట్రాల్లో కూడా మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవాలి. అన్ని వసతులు కల్పించడంతో పాటు రక్షణగా నిలవాలి. సేవ చేయాలని వచ్చాం. భద్రత..రక్షణ ఇవ్వాలని కోరుతున్నాం. –హన్నా షైస్సీ, జూనియర్ డాక్టర్, చిత్తూరు

రక్షణ కల్పించండి



గతంలో రాత్రి డ్యూటీ అయితే మా వెంట సెక్యూరిటీ సిబ్బంది రక్షణగా ఉండేవారు. ఏం కావాలన్న వారు తోడుగా వచ్చేవారు. ఇప్పుడు సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలు వచ్చేశాయి. అయినా పూర్తిస్థాయిలో సెక్యూరిటీ ఉండాలి. ఆస్పత్రిలో పనిచేసే మహిళా వైద్యులు, హెడ్, స్టాఫ్ నర్సులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలి. ప్రస్తుతం జరుగుతున్న ఘటనలు దృష్టిలో ఉంచుకుని భద్రత ఇవ్వాలి. నిర్లక్ష్యం వద్దు.

– ప్రసన్న కుమారి, విశ్రాంత నర్సింగ్ సూపరింటెండెంట్, చిత్తూరు

సమస్యల్లేకుండా చూస్తాం



మహిళా వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది భద్రత విషయంలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. రివ్యూ మీటింగ్‌లు పెడుతున్నాం. ఆ మీటింగ్‌లో మా దృష్టికి వస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో బిగించాం. ఇంకా ఎక్కడైనా అవసరమైతే ఏర్పాటు చేస్తాం. ఇక వసతులను చూస్తాం. తప్పకుండా వారి భద్రతకు ధోకా లేకుండా చూస్తాం.

– డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

భద్రత..క్యాంటీన్ ప్లీజ్!



మాకు ఆస్పత్రిలో ప్రధానంగా నైట్ డ్యూటీ సిబ్బందికి భద్రత పూర్తి స్థాయిలో కల్పించాలి. ఆస్పత్రిలో క్యాంటీన్ లేక ఇబ్బందులు పడుతున్నాం. పగలు అయితే పర్వాలేదు. రాత్రి సమయంలో ఇబ్బంది. రాత్రి పూట ఆకలితోనే డ్యూటీ చేయాల్సి వస్తోంది. చాలామంది ఈ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వీటిని పరిష్కరించాలి. –హిమబిందు, స్టాఫ్ నర్స్, చిత్తూరు

మళ్లీ అతిసారం కేసులు నమోదు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

కాణిపాకం: చిత్తూరులోని అపోలో కాలేజీలో గురువారం కూడా అతిసారం కేసులు నమోదయ్యాయి. బాధిత విద్యార్థులను ఎప్పటికప్పుడు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుతం 112 మంది ఉండగా అందులో నలుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఒకరిని సీఎంసీకి తరలించారు. 30 మందికి అపోలో కాలేజీలోనే ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. రెండు రోజుల్లో బాధితులకు దాదాపు 1200 సెలైన్ బాటిళ్ల వాడినట్లు అధికారులు చెప్పారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ అపోలో కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్ని శాంపిల్స్ సేకరించింది. జిల్లా వైద్య ఆరోగ్య, విధాన పరిషత్ అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లాలో రెండు ఇసుక డిపోల నుంచి ఇసుక పంపిణీ
- సెప్టెంబర్ 21 నుంచి ఆన్‌లైన్ బుకింగ్
- సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రెండు ఇసుక డిపోల్లో 1,84,519 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక పంపిణీలో వసూలు చేస్తున్న నగదు ట్యాక్సులకు మాత్రమేనని చెప్పారు. ఇప్పటివరకు 58 వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయంతో రూ.91 లక్షల వరకు ఆదాయం వచ్చిందన్నారు. ఇసుక రవాణా, పాలసీని పకడ్బందీగా అమలు చేసేందుకు తాను, ఎస్పీ పలుమార్లు క్షేత్రస్థాయిలో పర్యటించామని తెలిపారు.

అధిక రేట్లు వసూలు చేస్తే చర్యలు

ఇసుక రవాణా చేసే వాహనదారులు ప్రజల నుంచి అధిక ధరలను వసూలు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కి.మీలను బట్టి రేట్లను నిర్ధారించినట్లు చెప్పారు. ఎక్కడైనా అధికంగా నగదు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే జిల్లాలో 1,25,000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, రోజూ 2 స్టాక్ పాయింట్ల నుంచి 1500 మెట్రిక్ టన్నుల ఇసుక పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 21 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ అందుబాటులోకి వస్తుందని, త్వరలో చిత్తూరు రూరల్‌లోని పెద్దకాలువ సచివాలయం నుంచి బుకింగ్ మొదలు పెడతామన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సెబ్, పోలీస్, రెవెన్యూ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 74 ట్రాక్టర్లు సీజ్ చేసి ప్రతి ట్రాక్టర్‌కు రూ.6 వేల వరకు జరిమానా విధించినట్లు తెలిపారు. మొత్తం రూ.3.50 లక్షలు జరిమానా విధించామన్నారు. పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి, పలమనేరు మండలాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, అక్కడ ప్రత్యేక ఫోకస్ పెట్టామన్నారు. త్వరలో ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ ప్రారంభిస్తామన్నారు.

ఒక డిపోలో స్టాక్

జిల్లాలో ఒక డిపోలో ఇసుక స్టాక్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పలమనేరు, పుంగనూరు, కుప్పంలో త్వరలో కొత్త డిపోలను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు డిపోల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయడం జరుగుతోందన్నారు. ప్రతి నెల 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకెళ్లవచ్చని, జేసీబీలతో తీయకూడదన్నారు. జిల్లాలో 666 మైనింగ్ లీజులు ఉన్నట్లు తెలిపారు. 120 మైనింగ్‌లు నిబంధనలు పాటించకపోవడంతో వాటిని నిలిపివేశామన్నారు. ఎస్పీ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ఇసుక పాలసీలో 14 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు నమోదు చేసిన కేసుల్లో ఎక్కువగా రాత్రి సమయంలో ఇసుక తరలించినవే ఉన్నట్లు చెప్పారు. ప్రజలు ఎస్పీ నంబర్ 9440796700, కంట్రోల్ రూమ్ నంబర్ 9440900005కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని ఎస్పీ వెల్లడించారు.

క్లుప్తంగా

ఓవర్‌లోడ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

– ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: నగరాలు, పట్టణాల్లో ఓవర్‌లోడ్ ఉండే ప్రాంతాలలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ, డీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. లోడు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం లేదా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏసీడీ, అదనపు లోడు సొమ్ముతోపాటు బకాయిలను వసూలు చేయాలని, ప్రతినెలా డివిజన్ల వారీగా వందశాతం రెవెన్యూ సాధించాలని ఆదేశించారు. పంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధుల నుంచి పెండింగ్ కరెంటు బిల్లులు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం కేసు

–ఆయనతోపాటు మరో నలుగురు అరెస్ట్

పలమనేరు: బైరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్ శ్రీనివాసులు రెడ్డి మరో నలుగురిపై గంగవరం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి గురువారం అరెస్ట్ చేశారు. అదే మండలం లక్కనపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు రఘుచంద్రగుప్త తన కారును కొందరు పథకం ప్రకారం ఢీకొని తనను హతమార్చేందుకు ఈ కుట్ర చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం విదితమే. దీనిపై విచారణకు పూనుకున్న గంగవరం పోలీసులు శ్రీనివాసులు రెడ్డితోపాటు కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు చెందిన అస్లాం, మునియప్ప, ఈశ్వర్, శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిసింది. వీరిని స్థానిక మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రిమాండ్‌కు తరలించనున్నట్టు సమాచారం.

చిత్తూరులో చెయిన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఓ మహిళ మెడ నుంచి బంగారు గొలుసును చెయిన్ స్నాచర్లు లాక్కుని ఉడాయించిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. సాంబయ్య కండ్రిగ చెందిన సునీత బుధవారం రాత్రి తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై పుత్తూరు రోడ్డులో వెళుతుండగా, సాంబయ్య కండ్రిగ కూడలి దాటగానే వెనక నుంచి మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. దీనిపై బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్ టౌన్ సీఐ జయరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు దొంగ బండ్లు.. జోరుగా స్మగ్లర్లు!

- సెబ్‌కు పట్టుబడుతున్న రికార్డుల్లేని వాహనాలు
- ఆన్‌లైన్‌లో కనిపించని వాహనాల నంబర్ వివరాలు
- ఛాసిస్, ఇంజిన్ నంబరుకు.. నంబర్ ప్లేట్‌కు పొంతన లేని వైనం!
- అక్రమ రవాణాకు వీటిని వినియోగిస్తున్న స్మగర్లు

పలమనేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో అక్రమ వ్యాపారాలు జోరందుకున్నాయి. శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం, కర్ణాటకలోని బంగారుపేటకు బియ్యం, కర్ణాటక నుంచి ఇక్కడికి మద్యం, తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్కడి పీడీఎస్ ఉప్పుడు బియ్యం, వేలూరు జిల్లా నుంచి నాటు తుపాకులకు నల్లమందు, గుండ్లు, బండలు పేల్చేందుకు జిలెటిన్ స్టిక్స్, దారం అక్రమ రవాణా ఊపందుకుంది. ఇక పుంగనూరు నుంచి కబేళాలకు పశువులు నిత్యకృత్యమే. ఇందుకోసం సంబంధిత శాఖలకు ఎప్పుడైనా వాహనాలు పట్టుబడితే తప్పించుకోవడానికి స్మగర్లు దొంగ వాహపాలను తమిళనాడులో కొని ఇక్కడ అక్రమ రవాణాకు వినియోగిస్తున్నారు. అధికారులకు బైక్‌లు, ఇతర వాహనాలు పట్టుబడినా నంబర్ ప్లేట్‌కు, ఇంజిన్, ఛాసిస్ నంబర్లకు పొంతన లేక రవాణాశాఖ అధికారులు సైతం ఈ వాహనాలెవరివో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

ఇలా వెలుగులోకి....

ఇటీవల ఎస్‌ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) ఎక్సైజ్ మొబైల్ పార్టీ, ఎక్సైజ్ పోలీసులు, బోర్డర్ ఎక్సైజ్ పార్టీలు జిల్లా అంతరాష్ట్ర సరిహద్దుల్లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని వాహనాలతో సహా స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసేందుకు ఆ కార్లు, ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తే ఆన్‌లైన్‌లో ఆర్‌సీ తదితర వివరాలే కనిపించలేదు. ఇదేమని గమనిస్తే వాటికి అసలు ఇంజిన్, ఛాసిస్ నంబర్లే లేవు! కొన్నింటికి ఉన్నా నంబర్‌ప్లేట్‌కు వాటికి సంబంధమే లేదు. దీంతో చేసేదిలేక నామమాత్రంగా వాహనాలపై ఉన్న తాత్కాలిక నంబర్లతోనే కేసులు నమోదు చేయక తప్పలేదు. దీనిపై సంబంధిత అధికారులను ఆరా తీయగా..కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలించే వాహనాలు, బైక్‌లలో చాలావరకు ఇలాంటి రికార్డులు లేనివే అనే విషయం బయటపడింది.

తెలివి మీరిన స్మగ్లర్లు

కర్ణాటక నుంచి వచ్చే అక్రమ మద్యానికి చెక్ పెట్టేందుకు ఎక్సైజ్, సెబ్ అధికారులు నిందితులపై కేసుల నమోదుతోపాటు వాహనాలు విడుదల కాకుండా చూస్తున్నారు. కనీసం ఈ భయంతోనైనా మద్యం అక్రమ రవాణా తగ్గుముఖం పడుతుందని భావించారు. అయితే అక్రమ రవాణాకు అలవాటు పడిన స్మగర్లు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. తమిళనాడు నుంచి రికార్డులు లేని దొంగబండ్లను కారుచౌకగా కొని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి కన్నడ మద్యం అక్రమ రవాణాకు వినియోగిస్తున్నారు. పోలీసులు లేదా ఎక్సైజ్ అధికారులు వాటిని సీజ్‌చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. రికార్డులు లేని ఇలాంటి వాహనాలను బహిరంగ వేలం వేసినా వీటిని కొనేందుకు ఎవరూ ముందుకురావడం లేదు. చివరకు తుక్కు కింద అమ్ముకునే పరిస్థితి కలుగుతోంది.



ఎక్సైజ్, పోలీసుస్టేషన్ల వద్ద రికార్డులు లేని వాహనాలు (ఫైల్)

దొంగబండ్లకు అడ్డా పేర్నంబట్

తమిళనాడు రాష్ట్రంలోని పేర్నంబట్ దొంగ వాహనాలకు అడ్డాగా మారింది. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోని దొంగ వాహనాలను కొనే ముఠా పేర్నంబట్‌లో కొన్నేళ్లుగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తోంది. గతంలో ఎర్రచందనం అక్రమరవాణాకు స్మగర్లు పేర్నంబట్ నుంచే వాహనాలను కొని ఉపయోగించేవారు. దీంతో ఈ వ్యాపారం అక్కడ పుంజుకుంది. చౌకగా అక్కడ రికార్డులు లేని వాహనాలు లభిస్తుండటంతో కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని స్మగ్లింగ్ చేసే వారు ఎక్కువగా వీటినే వినియోగిస్తున్నారు. వాహనాల తనిఖీ సమయంలో పోలీసులు, రవాణా శాఖ అధికారులు రికార్డులు లేని వాహనాలను గుర్తిస్తే ఇవి ఎక్కడ నుంచి వస్తున్నాయో గుర్తించి, ఆపై ఈ అక్రమాలకు చెక్ పెట్టడానికి అవకాశం కలుగుతుంది.

అన్ని అక్రమాలకు ఇలాంటి వాహనాలే..!

ప్రస్తుతం శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలు దొంగ వాహనాల్లో వివిధ మార్గాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి కర్ణాటకలోని కటికనహళ్లికి చేరవేస్తున్నారు. నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు నుంచి బియ్యం లారీలు కర్ణాటకలోని బంగారుపేటకు అక్రమంగా వెళుతున్నాయి. అక్కడి నుంచి పలు వాహనాల్లో మద్యాన్ని ఏపీలోకి తరలిస్తున్నారు. జిల్లా నుంచి కర్ణాటకకు ఇసుక అక్రమ రవాణా అవుతుండగా, కర్ణాటక నుంచి మద్యం ఇక్కడికి వస్తోంది. వీటికోసం తమిళనాడులోని పేర్నంబట్, గుడియాత్తం, వేలూరు ప్రాంతాల్లోని దొంగ వాహనాలను తక్కువ ధరకు కొని ఇందుకోసం వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్ రెడ్డిని వివరణ కోరగా.. అక్రమార్కులు అక్రమ రవాణాకు ఇలాంటి రికార్డులు లేని వాహనాలనే సాధారణంగా వాడుతుంటారని, వీటిని ఏ శాఖ పట్టుకున్నా వారికి నష్టం లేకుండా ప్లాన్ చేస్తుంటారన్నారు. తమకు పట్టుబడిన వాహనాలను సంబంధిత ఆర్‌టీఓలకు రెఫర్ చేసి వారి వివరాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు అంతరిక్ష దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని డీఈఓ దేవరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయాన్ని గుర్తు చేసుకోవడానికి భారత ప్రభుత్వం ఆగస్టు 23వ తేదీని ×జాతీయ అంతరిక్ష దినోత్సవం×గా ప్రకటించిందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, శిక్షణా సంస్థల్లో విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు, ఉపన్యాసాలు నిర్వహించాలన్నారు. క్విజ్‌పోటీలు, చంద్రయాన్ నమూనా తయారీ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు.

ఏపీ పీజీ సెట్‌లో కోడ్ తప్పనిసరి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంకామ్ కోర్సులో ఆప్షన్లు పెట్టుకునే విద్యార్థులు కోడ్‌ను తప్పనిసరిగా గమనించాలని కామర్స్ విభాగపు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకామ్ రెగ్యులర్ కోసం ఎస్వీయూసీ, పేమెంట్‌కోసం ఎస్వీయూసీపీఏకోడ్‌నూ, ఎంకామ్ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ కోర్సు, ఫెనాన్షియల్ మేనేజ్‌మెంట్ వంటి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో చేరదలచినవారు ఎస్వీయూసీఎస్‌ఎఫ్ కోడ్‌ను ఆప్షన్లల్లో ఉంచుకోవాలని కోరారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుకు ఎస్వీయూసీఎస్‌ఎఫ్, స్పాన్సర్ సీటుకోసం ఎస్వీయూసీఎస్‌ఎస్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిపాల: 1152 టెట్రా కర్ణాటక ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. మండలంలోని మరకాలకుప్పం హరిజనవాడకు చెందిన రాజశేఖర్ అలియాస్ రాబర్ట్ (37) బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా టీఎన్21ఏసీ3141 గల టాటా ఇండికా వాహనంలో కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లను తీసుకు వస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నామని తెలిపారు. అతన్ని విచారణ చేయగా వెప్పాలమానుచేను గ్రామానికి చెందిన ఉదయ్‌తో తనకు పరిచయం ఏర్పడిందని, అతని ద్వారా గుడిపాల, చిత్తూరు టౌన్ ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు చెప్పాడన్నారు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఉదయ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా అతను పరారీలో ఉన్నాడని తెలిపారు.

ఆక్రమణలు తొలగించి వేలం వేయండి



ఆక్రమణలను తొలగించాకే వేలం నిర్వహించాలని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



చెత్త కుప్పలకు నిలయంగా మారిన ఆలయ మాన్యం

- ఈఓ కమలాకర్‌ను నిలదీసిన గ్రామస్తులు
- ఆలయ మాన్యం భూములు సాగు లీజు వేలం వాయిదా

చౌడేపల్లె: మండలంలో గోసలకురప్పల్లె సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల్లో ఆక్రమణలు తొలగించాకే వేలం నిర్వహించాలని గ్రామస్తులు ఈఓ కమలాకర్‌ను నిలదీశారు. గురువారం 16.32 ఎకరాల ఆలయ మాన్యం భూములను మూడేళ్లపాటు పంటలు సాగు చేసుకునేందుకు వేలం కార్యక్రమం నిర్వహించారు. దీనిని గ్రామస్తులు, అడ్డుకుని నిలదీశారు. మాన్యం భూములను దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు, తాత్కాలిక అంగళ్లు ఏర్పాటు చేశారని, ఇక లీజు కిచ్చే స్థలంలో చెత్తాచెదారం వేసి డంపింగ్ యార్డును తలపించేలా చేశారని మండిపడ్డారు. ఓ వ్యక్తి కొయ్యల అంగడి ఏర్పాటు చేశారని ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. వేలంలో ఆక్రమణల ప్రాంతాలు పొందితే ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. చెత్తకుప్పలు, ఆక్రమణలను తొలగించిన తర్వాతే వేలం నిర్వహించాలని పట్టుబడడంతో ఈఓ వాయిదా వేశారు. ఆక్రమణదారులు మూడు రోజుల్లోపు ఖాళీ చేయాలని లేనిపక్షంలో జేసీబీలతో ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. ఇక, కోట్లాది రూపాయల విలువ చేసే మాన్యం ఆక్రమణలపై ఏ చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,957 మంది స్వామివారిని దర్శించుకోగా 33,066 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించేది లేదని టీటీడీ స్పష్టం చేసింది.

అయ్యో..దేవుడా!

- చంద్రగిరి నాగాలమ్మ ఆలయ సమీపంలో ఘోర ప్రమాదం
- సడన్ బ్రేక్ వేసిన లారీ.. వెనుకనే వేగంగా వచ్చి ఢీకొట్టిన బైక్
- భర్త మృతి, భార్యకు గాయాలు

తిరుపతి రూరల్: లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బైక్ దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్ర బాబు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన సునీల్(35), తన భార్య, ఐదుగురు పిల్లలతో కలిసి చంద్రగిరిలోని నాగాలమ్మ ఆలయ సమీపంలో గుడిసెలో జీవిస్తున్నారు. భార్యాభర్తలు బొమ్మలు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బొమ్మలను అమ్ముకునేందుకు చంద్రగిరి నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వస్తున్నారు. పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిపై బాలాజీ డెయిరీ సమీపంలో ముందు వేగంగా వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుకనే బైక్‌పై వస్తున్న సునీల్ దంపతులు వేగంగా లారీని ఢీకొట్టారు. దీంతో తలకు తీవ్ర గాయమైన సునీల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితుడిపై కేసు

తిరుమల : నకిలీ పాస్‌పోర్టుతో రెండు శ్రీవారి కల్యాణం టికెట్లు పొందిన తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తిపై తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. వన్‌టౌన్ పీఎస్ సీఐ విజయ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరుకు చెందిన ఎస్.మురళీధర్, ఎస్.మురుగేశన్లు రెండు శ్రీవారి కల్యాణోత్సవం టికెట్ల కోసం తిరుపత్తూరుకు చెందిన నెట్ సెంటర్ నిర్వాహకుడు దళారి అన్నాదురైని సంప్రదించారు. దీంతో అతను నకిలీ పాస్ పోర్ట్ నంబర్లతో చివరి నాలుగు అంకెలు మాత్రం ఒరిజినల్ పాస్‌పోర్ట్ నంబర్లు ఉండేలా చూసుకుని టీటీడీ ఆన్‌లైన్ టికెట్లను బుక్ చేశాడు. ఈ మేరకు ఈనెల 21వ తేదీ సదరు టికెట్లతో తిరుమలకు వచ్చిన ఆ ఇద్దరు భక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి


చంద్రగిరి: ఉరివేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఐతేపల్లి సచివాలయ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతికి చెందిన పోలీనాయుడు అలియాస్ బాల(33) తమిళనాడుకు చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నారు. బతుకుదెరువు కోసం తొమ్మిదేళ్ల క్రితం ఐతేపల్లికి వసల వచ్చాడు. బాల ట్యాక్సీ డ్రైవరుగా పనిచేస్తుండగా, మహిళ భువనేశ్వరి రోజువారీ కూలీ. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భువనేశ్వరి, బాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన బాల సచివాలయ సమీపంలోని ఓ పాత భవనంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

● 'మేఘ' శోభితం..!



ఆకాశం కూడా ఎప్పుడూ ఒక చిత్రకారుడి కాన్వాసే..! ఉదయం, సాయంత్రం కెంజాయ రంగుల్లో హొయలొలికిస్తూ ఉంటుంది. సరికొత్త వర్ణశోభతో రంగుల మేఘ రాగం ఆలపిస్తుంది. మార్మికతను, అలౌకిక ఆనందానుభూతులను పంచుతుంది. గురువారం ఉదయం వీ.కోటలో 'మేఘ మల్హార్' రాగం పలికినట్లు..ఆకాశం అంతా ఇలా మబ్బు దొంతరలు కనువిందు చేశాయి. ఎవరో ఒక క్రమ పద్ధతిలో దూదిని పరచినట్లు ఆకాశం ధవళకాంతులీనింది.! – వీ.కోట

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



సంకటహర చతుర్థి వ్రతమాచరిస్తున్న భక్తులు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో గురువారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతమాచరించారు. పౌర్ణమి తర్వాత నాలుగో రోజు వచ్చే చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తులను పరిమళభరిత సుగంధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువు తీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతర్థి గణపతి వ్రతాన్ని భక్తులతో ఆలయ అర్చక వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, కోదండపాణి ,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరథంపై విహారం

స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి గురువారం రాత్రి ఆలయ మాడవీధులలో స్వర్ణ రథంపై విహరించారు. ప్రధాన ఆలయంలో సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వర్ణ రథంలో కొలువు దీర్చి, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ మాడవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర మంగళహారతులు నీరాజనాలు సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి తదితరులు పాల్గొన్నారు.